


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	584.80 (296.8580)	3,75,178	1,96,027
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.66 (3.61)	54.74	557.28
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	131.88 (7.10)	67,112	32,390

చికెన్ ధరలు | లైవ్: రూ.124 | డ్రెస్: రూ.200 | స్కిన్‌లెస్: రూ.230

సాగర్ నుంచి సాగరం వైపునకు

కృష్ణమ్మ




- ఏడాది విరామం తరువాత ఉరకలేస్తూ పరుగులు
- నాగార్జునసాగర్ 20 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
- ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో పనిచేయని 2, 4వ నంబర్ టర్బైన్లు
- 2018లో గేట్ల ఆపరేటింగ్‌కు ఏర్పాటు చేసిన సెన్సార్ సిస్టం వృథా



మహాబలేశ్వరంలో పుట్టి.. కొండా కోనలు.. వాగులు వంకలు దాటుతూ.. అన్నదాతల ఆశల సౌధాలు అల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులను నింపి.. బిడ్డల పరవశాన్ని ఒడిన నింపుకొని నాగార్జునసాగర్‌కు చేరుకున్న కృష్ణమ్మ.. సాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తడంతో సాగరం వైపునకు పరుగులిడుతోంది. ఏడాదిగా బోసిపోయిన నది, పరీవాహక ప్రాంతమంతా ఒక్కసారిగా కృష్ణమ్మ గలగలలతో పులకరించింది. ఒంపులు తిరుగుతూ.. సవ్వడులు చేస్తూ.. కృష్ణమ్మ నాగార్జునసాగర్ నుంచి 21కిలోమీటర్ల దూరంలో ఉన్న టెయిల్‌పాండ్‌కు,అక్కడి నుంచి 18కిలోమీటర్ల దూరంలో ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోంది. పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో 149కిలోమీటర్ల దూరం ప్రయాణించి.. వేల కిలోమీటర్లు అలుపెరగని ప్రయాణంతో అలసి సొలసిన కృష్ణమ్మ ఏపీ రాష్ట్రం ప్రకాశం బ్యారేజీకి చేరుకొని హంసల దీవి వద్ద సముద్రంలో ఏకమవుతుంది.

- నాగార్జునసాగర్

సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.5050 టీఎంసీలు) కాగా, సోమవారం రాత్రికి 584.60 అడుగులు(296.2810టీఎంసీలు)గా ఉంది. ఎగువ నుంచి 3,75178 క్యూసెక్కుల వరద వస్తోంది. సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ నారాయణరెడ్డి, ప్రాజెక్టు సీఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లిఖార్జున్‌రావు ప్రాజెక్టు అధికారులతో కలిసి తొలుత ఆరు క్రస్ట్‌గేట్లను స్విచ్ ఆన్ చేసి ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో 546 అడుగులు ఎత్తు నుంచి కృష్ణమ్మ తెల్లని పాలపొంగుల నురగలు కక్కుతూ దిగువకు ఉరకలేసింది. గత ఏడాది సాగర్‌కు ఎగువ నుంచి వరద లేకపోవడంతో క్రస్ట్‌గేట్లను ఎత్తలేదు. కాగా, సోమవారం ఉదయం 10 గంటలకు ఆరు క్రస్ట్‌గేట్లను ఎత్తిన అధికారులు, క్రమంగా గేట్ల సంఖ్యను పెంచుతూ సాయంత్రం 7 గంటల సమయానికి 16 క్రస్ట్‌గేట్లను



స్విచ్ ఆన్ చేస్తున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ఐదు అడుగుల మేర ఎత్తారు. రాత్రి 10 గంటలకు మరో నాలుగు గేట్లు ఎత్తి మొత్తం 20గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,50,580 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా, సోమవారం రాత్రి 10 గంటలకు 584.80 అడుగులు (296.8580 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 8,221 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,325 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,501 క్యూసెక్కులు, 20 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,50,580 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ నుంచి మొత్తం 1,96,027 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లను 12 అడుగుల మేరకు ఎత్తి, అలాగే రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేయడం ద్వారా మొత్తం 3,75,178 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

పనిచేయని ఆటోమెటిక్ గేట్ల ఆపరేటింగ్ సిస్టం



సెన్సార్

సాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తేందుకు 2018లో రూ.5కోట్ల వ్యయంతో ఆటోమెటిక్ సెన్సార్ సిస్టంను ఏర్పాటు చేశారు. కానీ, ఈ విధానం తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో వినియోగించడం లేదు. 2018 తర్వాత 2019, 2020, 2021, 2022లో వరుసగా నాలుగేళ్లు క్రస్ట్ గేట్లను మ్యానువల్‌గానే ఎత్తారు. దీంతో కోట్ల రూపాయలు వృథా అయ్యాయి. టెక్నాలజీ యుగంలోనూ పాత పద్ధతిలో గేట్లను ఆపరేట్ చేస్తుండటంతో ఒక్కోసారి మొరాయించే అవకాశం ఉంది. 2022లో క్రస్ట్ గేట్లను ఎత్తే క్రమంలో 1వ నంబర్ గేటు మొరాయించింది. అప్పటికప్పుడు ప్రాజెక్ట్ అధికారులు మరమ్మతులు చేయించి గేటును పైకి ఎత్తారు. కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ సెన్సార్ సిస్టంను ఇప్పటికైనా అందుబాటులోకి తీసుకురావాలని నీటిపారుదలశాఖ నిపుణులు కోరుతున్నారు.

జలవిద్యుత్ కేంద్రంలో పనిచేయని 2, 4వ టర్బైన్లు



సాగర్‌కు వారం రోజులుగా వరద రాక ప్రారంభం కాగా, గత నెల 29వ తేదీ నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తని జెన్‌కో అధికారులు ప్రారంభించారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉండగా, అందులో 1వ నంబరు టర్బైన్ బీహెచ్ఎఈఎల్ (ఇండియా)కు చెందినది కాగా, మిగిలిన ఏడు టర్బైన్లు జపాన్ దేశం నుంచి వచ్చినవి. ఎనిమిది టర్బైన్లలో 2, 4వ నంబరు టర్బైన్ మరమ్మతులకు గురై ఆరు నెలలు గడుస్తోంది. కాగా, నేటికీ జెన్‌కో అధికారులు మరమ్మతులు పూర్తి చేయలేదు. ప్రస్తుతం ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నా, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి అవకాశం లేకుండా పోయిందని నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద లేకపోవడంతో కేవలం 167మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను మాత్రమే ఉత్పత్తి చేశారు. అయితే టర్బైన్ల మరమ్మతులకు జపాన్ నుంచి నిపుణులు రావాల్సి ఉందని, అందుకే ఆలస్యమైందని జెన్‌కో ఎస్ఈ రఘురాం తెలిపారు.

ఆయకట్టుకు సాగునీరు : నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి •7లో..

సాగు వివరాలు ఇక పక్కా

- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- 1,49,257.07 ఎకరాల వివరాల్లో పూర్తి
- సెప్టెంబరు వరకు సర్వే కొనసాగింపు



బొమ్మాయిపల్లిలో పంటల నమోదు సర్వే నిర్వహిస్తున్న ఏఈవో అనిల్‌కుమార్

భువనగిరి రూరల్, ఆగస్టు 5 : జిల్లాలో పంటల సాగు విస్తీర్ణంపై సర్వే కొనసాగుతోంది. ఇందుకోసం అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. సాగు భూములు ఎన్ని ఉన్నాయి? ఎవరెవరు ఏఏ పంటలు సాగు చేస్తున్నారు? అనే అంశంపై సర్వే చేస్తున్నారు. 2018 నుంచి వానాకాలం సీజన్‌లో అధికారులు సర్వే చేస్తున్నారు. అదే క్రమంలో ఈ ఏడాది కూడా పక్కాగా లెక్క తేల్చాలన్న ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. అయితే ఈ పర్యాయం వివరాలను ప్రత్యేకయాప్‌లో నమోదు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అన్నిగ్రామాల్లో రైతు యూనిట్‌గా తీసుకుంటూ అధికారులు పంటల సాగు నివేదిక తయారు చేస్తున్నారు. రైతు పేరు, పంట సాగు, పట్టాపాస్‌పుస్తకం, భూసర్వే నెంబరు, ఎంత సాగు అన్న అంశాలతో కూడిన జాబితా సిద్ధం చేస్తున్నారు. ఆ జాబితా ఆధారంగా రైతులకు మార్కెటింగ్ సదుపాయం దిగుబడి అంచనా తదితర అంశాలను ముందస్తుగా తెలుసుకునే అవకాశం ఉంది. పంటలు సాగు చేసుకునే రైతులకే ప్రభుత్వం అందచేసే పథకాలు అర్హులు సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది.

ఖచ్చితమైన గణంకాలు..

రైతు భరోసా, రైతు బీమా, పంటల బీమా, ఇతర సాగు సంబంధ సంక్షేమ పథకాలు అన్నదాతల దరికి చేర్చాలంటే గణంకాలు ఖచ్చితంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది చెట్లు, గుట్టలు, సాగు చేయని భూములకు సంక్షేమ పథకాలు అమలు చేస్తే ప్రజాధనం దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని, ఇదే సమయంలో ఆర్థికంగా భారం పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఇప్పటివరకు 1,49,257.07 ఎకరాల్లో సర్వే పూర్తి

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2,59,349 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం 1,49,257.07 ఎకరాల్లో మాత్రమే వివిధ రకాల పంటలు సాగు వివరాలు నమోదుచేశారు. 10 రోజులుగా ఆశించిన వర్షాలు కురవడంతో వరి నాట్లు, ఇతర పంటల సాగులో రైతులు నిమగ్నమయ్యారు. జిల్లాలోని మూసీ పరివాహక ప్రాంతాలు, వ్యవసాయ బావులు, బోరు బావుల్లో భూగర్భజలాల పరిమితిని బట్టి సాగు పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు క్లస్టర్ల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. పంట పొలాల్లోకి వెళ్లి సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈసారి ప్రత్యేక యాప్ ద్వారా పంటల గణన చేపట్టి ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు. అనే ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేసేలా గణన చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు పొలంబాట పట్టారు. రైతురుణమాఫీ, రైతు బీమా, ఇతర పథకాల అమలుతో పంటల నమోదు ప్రక్రియ జిల్లాలో ఆలస్యమవుతోంది. రైతు బీమా దరఖాస్తుకు ఆగస్టు 5తో ముగిసింది. ఇప్పటి వరకు కేవలం 1,49,257.07 ఎకరాల్లో మాత్రమే నమోదు పూర్తయింది. సెప్టెంబరు మొదటి వారంలోపు నమోదు ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

పంటల ఉత్పత్తి గణాంకాల కోసం సర్వే



రైతులు సాగు చేసుకుంటున్న పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్రాప్ బుకింగ్(సర్వే) నిర్వహిస్తున్నాం. వివరాలు క్రాప్‌బుకింగ్ యాప్‌లో నమోదు చేస్తున్నాం. భవిష్యత్ అవసరాల కోసం సర్వే ఉపయోగపడుతుంది. రైతులకు అందించే అభివృద్ధి పథకాలకు సంబంధించి ముందస్తుగా సదుపాయాలు సమకూర్చే అవకాశం ఉంటుంది. ఈ సర్వేతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదు.

- కె అనిల్‌కుమార్ ఏఈవో, భువనగిరి

సర్వేతో నిజమైన రైతులకు లబ్ధి



వ్యవసాయాధికారుల సర్వేతో రైతులకు లబ్ధి చేకూరుతుంది. గతంలో అధికారులు తూతూ మంత్రంగా సర్వే చేపట్టేవారు. ప్రస్తుతం ప్రత్యేక యాప్‌లో అన్ని వివరాలు అడిగి రికార్డు చేస్తుండటం బాగుంది.

- ఎస్ కృష్ణమూర్తి, రైతు వీరవెల్లి

ఇబ్బందులు తలెత్తకుండా...

పంటల ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసే సమయంలో ఖచ్చితమైన పంట విస్తీర్ణం లెక్కలు లేకపోవడంతో గందరగోళం నెలకొంటుంది. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు నమోదు చేస్తే మార్కెట్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ప్రభుత్వం భావిస్తోంది.

'స్వచ్ఛదనం, పచ్చదనం'తో నూతన రూపురేఖలు

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



భువనగిరిలో 'స్వచ్ఛదనం, పచ్చదనం' ర్యాలీలో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, ఎమ్మెల్యే కుంభం

భువనగిరి టౌన్, ఆగస్టు 5: జిల్లాలో ఐదురోజుల పాటు నిర్వహించనున్న 'స్వచ్ఛదనం, పచ్చదనం' కార్యక్రమంతో ఆరు పట్టణాలు, 421 గ్రామాల రూపురేఖలు మారతాయని కలెక్టర్ హనుమంతు కే.జెండగే, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరిలో 'స్వచ్ఛదనం, పచ్చదనం', అమృత్ 2.0లో భాగంగా పట్టణంలో రూ.21.80కోట్ల వ్యయంతో చేపడుతున్న ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణ పనులు, జిల్లా ఆస్పత్రిలో రూ.23కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఐసీయూ వార్డు పనులకు వేర్వేరుగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. ఈ నెల 9వ తేదీ వరకు నిర్వహించనున్న 'స్వచ్ఛదనం, పచ్చదనం'లో ప్రజలంతా భాగస్వాములు కావాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. స్వదేశీ దర్శన్ పథకానికి ఎంపికైన భువనగిరి ఖిల్లా అభివృద్ధికి కేంద్రం రూ.118 కోట్లను మంజూరు చేసిందని, తొలిదఫా రూ.68కోట్లతో త్వరలో పనులు ప్రారంభంకానున్నాయన్నారు. రూ.40కోట్లతో పట్టణ శివారులోని ముత్తిరెడ్డిగూడెం వద్ద క్రీడా స్టేడియం పనులు చేపడతామని, మల్లన్నసాగర్ నుంచి భువనగిరి వరకు 16కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.210కోట్లు మంజూరు చేసిందన్నారు. ముందుగా అవగాహనా ర్యాలీని నిర్వహించారు. అమృత్ 2.0తో పట్టణంలో వచ్చే 30 ఏళ్ల వరకు తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. జిల్లాకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాల త్వరలో భువనగిరిలో ప్రారంభం అవుతుందన్నారు. ఈ మేరకు ఎంఎన్‌సీ అనుమతులు రానున్నట్టు తెలిపారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆధునిక వైద్యం అందించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమాల్లో ఫైనాన్స్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, అదనపు కలెక్టర్ గంగాధర్, మునిసిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మెన్ మాయ దశరథ, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారాం, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ చిన్నానాయక్, మునిసిపల్ కమిషనర్ పి.రామాంజులరెడ్డి, డీఆర్డీవో అమరేందర్, జిల్లా అటవీ శాఖాధికారి పద్మజారాణి, ప్రజారోగ్యశాఖ ఈఈ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలో ప్రధాని ఫొటో లేకపోవడంపై బీజేపీ నిరసన

కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్2.0లో భాగంగా చేపట్టిన తాగునీటి పనుల శంకుస్థాపన కార్యక్రమ ఫ్లెక్సీలో ప్రధాని నరేంద్రమోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ నిరసన తెలిపింది.ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ తదితరులు శంకుస్థాపనకు సిద్ధమవుతుండగా, ఫ్లెక్సీపై ప్రధాని ఫొటో లేకపోవడంపై మునిసిపల్ వైస్ చైర్మెన్ మాయ దశరథ, కౌన్సిలర్ జనగాం కవిత అభ్యంతరం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూ.21.80కోట్లను మంజూరు చేసినా ప్రధాని ఫొటో లేకపోవడం ఆయన్ను అవమానించినట్టేనని అన్నారు. దీంతో ఎమ్మెల్యే, కలెక్టర్, మునిసిపల్ చైర్మెన్, కమిషనర్ తదితరులు వారికి సర్దిచెప్పగా, శంకుస్థాపన కార్యక్రమంలో టెంకాయ కొట్టకుండా వారు నిరసన తెలిపారు.

చేనేత కార్మికులకు రుణమాఫీ చేయాలి

కొయ్యలగూడెంలో నేతకార్మికుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

చౌటుప్పల్ రూరల్ ఆగస్టు 5: చేనేత కార్మికులకు రుణమాఫీ చేసి ఆదుకోవాలని చేనేత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. చేనేత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల పరిధిలోని కొయ్యలగూడెంలో చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు మహాపోరాట ర్యాలీ, గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, వ్యవసాయ రంగం తరువాత రెండో స్థానంలో ఉన్న చేనేతరంగానికి ప్రభుత్వాలు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు రూ.2లక్షల వరకు మాఫీ చేయాలని, జీఎస్టీ ఎత్తివేయాలని, బీమాను కొనసాగించాలన్నారు. చేనేత వస్త్రాలను వెంటనే కొనుగో లు చేయాలని, త్రిఫ్ట్ పథకం అమలు చేయాలని, చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహిం చి పరిశ్రమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం చౌటుప్పల్‌లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చేనేత సంఘాల ప్రతినిధులు మాచర్ల కృష్ణ, జెల్లా ఈశ్వరమ్మ, గడ్డం జయశంకర్, రమాశంకర్, గంజి కృష్ణ, కొలను సంతోష్, గంజి శ్రీను, కొలను మధు, పాల్గొన్నారు.

గంధమల్ల ప్రాజెక్టుపై అపోహలు వద్దు

- ఎవ్వరికీ నష్టం జరగకుండానే నిర్మాణం చేపడతాం
- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



గంధమల్ల చెరువును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

తుర్కపల్లి, ఆగస్టు 5: గంధమల్ల ప్రాజెక్టుపై అపోహలు వద్దని, ప్రజలెవ్వరికీ నష్టం జరకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. సోమవారం మండలంలోని గంధమల్ల చెరువును వారు పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు నిర్మాణంపై మండల పరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తపాస్‌పల్లి ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను నియోజకవర్గంలోని రాజాపేట, ఆలేరు ప్రాంతాలకు సాగు నీరుగా అందిస్తామని చెప్పి మాజీ మంత్రి హరీ‌ష్‌రావు సిద్ధిపేట జిల్లాకు తరలించుకుపోయారన్నారు. పాలకులు పట్టించుకోకపోవడంతో ఈప్రాంతం ఎడారిగా మారిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.8.60కోట్ల అంచనాతో 9.8టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పి కాలయాపన చేసి దాన్ని 4.5టీఎంసీలకు కుదించిందన్నారు. అంతేతప్ప ప్రాజెక్టు నిర్మాణానికి రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంపై స్పష్టత లేకపోవడంతో గ్రామస్థులు పదేళ్లుగా పలు ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు 1.48టీఎంసీలతో రిజర్వాయర్ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో గంధమల్ల, వీరారెడ్డిపల్లి, ఇందిరానగర్ గ్రామాలకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. అంతేగాక విద్యుత్ హైటెన్షన్ వైర్లను కూడా తొలగించాల్సిన అవసరం లేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఇరిగేషన్ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం రూ.520కోట్లు అవసరమని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.400కోట్లు, భూసేకరణకు రూ.120కోట్లు అవసరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు ద్వారా 52వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలెం, ఆర్డీవో అమరేందర్, జడ్పీ సీఈవో శోభారాణి, ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ రఘునాథ్ ప్రసాద్, డీఈలు శైలేందర్, కవిత, ఎంపీడీవో రూప్సీలక్ష్మిబాయి. తహసీల్దార్ దేశ్యానాయక్, ఏఈ రాంపతి, తదితరులు పాల్గొన్నారు.

గౌడసొసైటీకి ఐదెకరాల భూమి కేటాయింపునకు కృషి

యాదగిరిగుట్ట రూరల్: ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా గౌడ సొసైటీలకు ఐదెకరాల ప్రభుత్వ భూమి కేటాయించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. సోమవారం మండలంలోని యాదగిరిపల్లి వెంచర్‌లో మునిసిపాలిటీకి కేటాయించిన 10శాతం భూమిలో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా ఈత మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ వ్యాపారం కారణంగా తాటి, ఈత వనాలు అంతరించిపోతున్నాయని, దీంతో గౌడ్ కులస్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందుకు తాటి, ఈత వనాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, గౌడసొసైటీ అధ్యక్షుడు సీస కృష్ణగౌడ్, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేశం, గుండ్లపల్లి వాణి, బూడిద సురేందర్, బిట్టు సరోజ, మిట్ట వెంకటయ్యగౌడ్, కృష్ణగౌడ్, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ సైదులు, సీఐ దీపిక, గుట్ట సీఐ రమేష్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారులు లేకుండానే 'ప్రజావాణి'



ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న కలెక్టరేట్ ఏవో జగన్మోహన్

భువనగిరి అర్బన్, ఆగస్టు 5 : కలెక్టర్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఉన్నతాధికారులు లేకుండానే ప్రజావాణి నిర్వహించారు. తుర్కపల్లి మండలం గంధమల్లలో రిజర్వాయర్ నిర్మాణం కోసం చేపట్టిన సమావేశానికి అధికారులు, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి కలెక్టర్ హనుమంతు కే జెండగేతో పాటు అదనపు కలెక్టర్లు, వివిధశాఖల అధికారులు వెళ్లడంతో ప్రజావాణిని కలెక్టరేట్ అధికారులతో నిర్వహించారు. ప్రజల నుంచి 90 అర్జీలు వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయి.

- ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి, నాణ్యమైన భోజనం అందజేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ కలెక్టరేట్ ఏవో జగన్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట సంఘం నాయకులు చింతపల్లి అరుణ్, ప్రవీణ్, మహిళ సమాఖ్య నాయకురాలు సబిత పాల్గొన్నారు.
- అర్హులైన నిరుపేదలకు నివేశిత స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సోమన సబిత, బండి జంగమ్మ, నాయకులు పుట్ట రమేష్, చింతల పెంటయ్య, నాగపురి యాదగిరి, అబ్బులు, వెంకట్‌రెడ్డి, శ్రీను, నర్సయ్య పాల్గొన్నారు.
- జిల్లా కేంద్రంలోని ఎస్టీ వసతి గృహంలో ఆదివారం రాత్రి నుంచి విద్యార్థులు ఉపవాసం ఉన్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు తెలిపారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వేముల నాగరాజు, రాహుల్, నేహాల్, భవాని శంకర్ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు పరిహారం ఇవ్వాలి


బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణంతో ముంపునకు గురవుతున్న బీఎన్‌తిమ్మాపూర్ నిర్వాసితులకు వెంటనే పరిహారం అందజేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీని పూర్తిస్థాయిలో అందించి నిర్వాసితులకు రూ.200కోట్ల పరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ముంపు నిర్వాసితుల ప్రతినిధులు రావుల నందు, ఉడుత ఆంజనేయులు, ఎడ్ల దర్శన్ రెడ్డి, వల్దాసు గండయ్య, హరినాథ్, బాలనర్సింహ, బాలయ్య, లాలయ్య తదితరులున్నారు.



మూడు ఇసుక లారీల పట్టివేత

కోదాడ రూరల్, ఆగస్టు 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా మూడు లారీల్లో ఇసుకను తరలిస్తుండగా సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా లారీల్లో తరలిస్తున్న ఇసుకను గుర్తించి సీజ్ చేసి మైనింగ్ శాఖకు అప్పగించినట్లు తెలిపారు. ఇసుక తరలిస్తున్న డ్రైవర్లు, ఓనర్లు షేక్ రసూల్, షేక్ అఫ్రోజ్, తాటి కొండల్‌రావు, పాములపాటి సీతారామయ్య, షేక్ మహ్మద్ రఫీలపై కేసు నమోదు చేశారు.






హరిహరులకు విశేష పూజలు


శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, ఆగస్టు 5: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవార్లకు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.17,80,292 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరీశుడిని భూగర్భ, గనుల శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, సీఎం చీఫ్ పీఆర్వో బోరెడ్డి ఆయోధ్యరెడ్డి, కవి, రచయిత అందెశ్రీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కనగల్, ఆగస్టు 5: నల్లగొండ జిల్లా కనగల్ మండలకేంద్రంలోని ఓ ఇంట్లో నిల్వ చేసిన 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్, కనగల్ పోలీసులు సోమవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పట్టుబడిన బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామానికి చెందిన కె. వెంకన్నపై కేసు నమోదు చేశారు. పేదల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ విష్ణు హెచ్చరించారు.





















ఆయకట్టు రెండు పంటలకు సాగునీరు

● నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తి నీరు విడుదల చేసిన కలెక్టర్

నాగార్జునసాగర్, ఆగస్టు 5: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది ఆయకట్టు రెండు పంటలకు సాగునీరు అందిస్తామని నల్లగొండ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. నాగార్జుసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం పూర్తి స్థాయికి చేరువలో ఉన్నందున సోమవారం మధ్యాహ్నం క్రస్ట్ గేట్లను స్విచ్చాన్ చేసి ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 8క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని, సాయంత్రానికి 14 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తినీటిని దిగువకు విడుదల చేస్తామని తెలిపారు. ఇప్పటికే సాగర్ ఎడమ కాల్వ సాగునీటి కోసం నీరు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఆయకట్టులో రెండు పంటలకు ఎలాంటి ఆటంకం లేకుండా సాగునీరు అందుతుందని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎక్కడైనా కాల్వలు బలహీనంగా ఉంటే గుర్తించి మరమ్మతులు చేయిస్తామన్నారు. అందుకే ప్రస్తుతం కాల్వలకు కొద్దికొద్దిగా నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. మరో నాలుగైదు రోజుల్లో ఎడమ కాల్వకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేస్తామన్నారు. ఎడమ కాల్వ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను నింపుతామన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వచ్చే వరదను బట్టి సాగర్ గేట్ల సంఖ్యను పెంచి మరింత నీటిని దిగువకు విడుదల చేస్తామన్నారు. సాగర్ క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నందున నది పరీవాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లి ఖార్జున్‌రావు, డీఈ శ్రీనివాస్, జేఈ కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి : సీఈ నాగేశ్వర్‌రావు

16 క్రస్ట్ గేట్ల ద్వారా 1,20,064క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,804 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వ ద్వారా 8259 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 4949 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,64,376 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లను 12 అడుగుల మేరకు ఎత్తి, రెండు జలవిద్యుత్ కేంద్రాలల్లో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 3,75,178 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను సోమవారం ఎత్తడంతో సాయంత్రం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకుల కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు వచ్చారు. సాగర్ ప్రధాన డ్యాం పైకి ఎవరికీ అనుమతి లేకపోవడంతో పర్యాటకులు ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారిలో నిల్చోని క్రస్ట్ గేట్ల నుంచి కిందికి దూకుతున్న కృష్ణమ్మ అందాలను తిలకిస్తున్నారు. మంగళవారం నుంచి పర్యాటకుల రాక పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానడ్యాం వద్దకు రాకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాగర్ నుంచి సాగరం వైపు...





నాగార్జునసాగర్‌కు చేరుకున్న కృష్ణమ్మ.. సాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తడంతో సాగరం వైపునకు పరుగులీడుతోంది. ఏడాదిగా బోసిపోయిన నది, పరీవాహక ప్రాంతమంతా ఒక్కసారిగా కృష్ణమ్మ గలగలలతో పులకరించాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను సోమవారం ఎత్తడంతో సాయంత్రం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకుల కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు సాగర్‌కు వచ్చారు. సాగర్ ప్రధాన డ్యాం పైకి ఎవరికీ అనుమతి లేకపోవడంతో పర్యాటకులు ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారిలో నిల్చోని క్రస్ట్ గేట్ల నుంచి కిందకు దూకుతున్న కృష్ణమ్మ అందాలను తిలకిస్తున్నారు. పర్యాటకులు ఎవరూ రాకుండా పోలీసు బందో బస్తు ఏర్పాటు చేయడంతో పాటు రోప్‌లు కట్టారు.



వాయనం ఇస్తున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



స్విచ్ ఆన్‌చేస్తున్న ప్రాజెక్టు సీఈ నాగేశ్వర్‌రావు



సాగర్ అందాలను తిలకించేందుకు వస్తున్న ఓ కుటుంబం



నిండుకుండలా నాగార్జునసాగర్ జలాశయం



నాగార్జునసాగర్ జలాశయంపై గస్తీ కాస్తున్న భద్రతా సిబ్బంది



సాగర్ అందాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న పర్యాటకులు

స్నేహితుల రోజున విషాదం

● కేక్ కట్‌చేసి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఒకరు ● బైక్‌పై అదుపుతప్పి మరొకరు మృతి

అర్వపల్లి, సంస్థాన్‌నారాయణపురం, ఆగస్టు 5: స్నేహితుల దినోత్సవం రోజు విషాదం నింపింది. కేక్ కట్‌చేసిన తర్వాత బైక్‌పై వస్తుండగా సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలకేంద్రంలో కారు ఢీకొని ఒకరు మృతిచెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామంలో బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి పడిపోయి మరొకరు మృతిచెందారు. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన లింగంపల్లి శ్రీనివాస్(49) స్నేహితుల దినోత్సవం సందర్భంగా తన అన్న కుమారులు లింగంపల్లి సైదులు, లింగంపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం రాత్రి అర్వపల్లిలో కేక్ కట్‌చేశారు. అనంతరం వేర్వేరు బైక్‌లపై ఇంటికి వెళ్తుండగా 356 జాతీయ రహదారిపై సూర్యాపేట నుంచి అతివేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. బైక్‌పై ఉన్న శ్రీనివాస్ సుమారు 20మీటర్ల వరకు ఎగిరిపడి తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. పక్కనే ఉన్న తమ ఇంటికి ఒక్క నిమిషంలో చేరుకునేలోపు ఈ ప్రమాదం జరిగింది. శ్రీనివాస్ 15ఏళ్లుగా 104 వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అర్వపల్లి ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.



శ్రీనివాస్(ఫైల్)

బైక్‌పై వెళ్తుండగా..

సంస్థాన్‌నారాయణపురం మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన మల్లెపల్లి రాంరెడ్డి-విజయలక్ష్మి దంపతుల కుమారుడు మల్లెపల్లి శ్రీకాంత్‌రెడ్డి(37) ఆదివారం గ్రామంలో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లాడు. స్నేహితులతో కలిసి సంతోషంగా గడిపాడు. తిరిగి రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడడంతో బండరాళ్లు తలకు అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి ఎవరూ గమనించలేదు. సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తున్న వ్యక్తి రోడ్డు పక్కన ప్రమాదానికి గురైన బైక్ గుర్తించి పక్కనే గుంతలో చూశాడు. అక్కడ శ్రీకాంత్‌రెడ్డి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్ తెలిపారు.



శ్రీకాంత్‌రెడ్డి(ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కొండమల్లేపల్లి, ఆగస్టు 5: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. పీఏపల్లి మండలం బాలాజీనగర్‌కు చెందిన మెగావత్ తావు(55) స్వగ్రామంలో కిరాణ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పక్షపాతానికి గురైన తావుకు ఒక చెయి మాత్రమే పని చేస్తుంది. ఒక్క చేతితోనే ఆటో నడుపుతుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కిరాణ సామాను తీసుకురావడానికి కొండమల్లేపల్లికి ఆటోలో వస్తుండగా కొండమల్లెపల్లి చౌరస్తా వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డ వచ్చింది. దీంతో అదుపు తప్పిన ఆటో డివైడర్‌ను ఢీకొంది. తావు తలకు తీవ్రగాయం కావడంతో చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. తావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. తావు కుమారుడు మెగావత్ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.



తావు(ఫైల్)

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

పెద్దవూర మండలం పోతునూరు గ్రామానికి చెందిన జెనిగల మల్లేష్(25) కొండమల్లేపల్లి మండలకేంద్రంలో గల ట్రాక్టర్ షోరూంలో ఇటీవల విధుల్లో చేరాడు. రోజు మాదిరిగానే పనులు ముగిసిన తర్వాత తన సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం పోతునూరుకు వెళ్తుండగా స్థానిక సాగర్‌రోడ్డులో గల టూరిజం హోటల్ ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లేష్‌కు భార్య, ఏడాదిలోపు కూతురు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



మల్లేష్(ఫైల్)

శాంతినగర్‌లో 141 కోడెదూడల పట్టివేత

అనంతగిరి, ఆగస్టు 5: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామం వద్ద ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా కోడెదూడలతో వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని హనుమాన్ జంక్షన్ నుంచి హైద్రాబాద్‌కు 141 కోడెదూడలను ఎక్కించుకుని ఖమ్మం జిల్లా మీదుగా హైదరాబాద్‌కు తరలించేందుకు బయలు దేరారు. మండలంలోని శాంతినగర్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో డీసీఎంలో ఈ 141 కోడె దూడలను గుర్తించారు. వ్యాన్‌ను, అందులో ఉన్నటు కోడె దూడలను హైద్రాబాద్, మఠంపల్లి గోశాలలకు తరలించారు. వ్యాన్ డ్రైవర్లు, గోశాలకు తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులు ఎండి. జలీల్, శర్మ, పఠాన్ వసీంఖాన్, సంతోష్, వడ్లమూడి రాము, షేక్ మహ్మద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



కోడెదూడలను తరలిస్తున్న డీసీఎంను పట్టుకున్న పోలీసులు

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

గుండాల, సూర్యాపేటక్రైం, ఆగస్టు 5: యాదాద్రిభువనగిరి, సూర్యాపేట జిల్లాలో వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. గుండాల మండలంలోని వంగాల గ్రామానికి చెందిన చిప్పలపల్లి కుమారస్వామి(22) ఆరు సంవత్సరాలుగా మోత్కూరులో ద్విచక్రవాహనా మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్‌కు వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వారించారు. దీంతో మనస్తాపానికి గురైన కుమారస్వామి ఈ నెల 3వ తేదీన పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.



కుమారస్వామి(ఫైల్)

మానసికస్థితి సరిగా లేక...

సూర్యాపేట మండలం పిన్నాయిపాలెం గ్రామానికి చెందిన ఉప్పల మురళీ(30) జిల్లా కేంద్రంలోని చింతలచెర్వు వద్ద గల చెరువు కట్ట సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మురళీ మానసికస్థితి కొంతకాలంగా సరిగా లేదు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినప్పటికీ మానసికస్థితి సరిగా లేకపోవడం, కొంతమేర ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో సోమవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి చింతల చెర్వు వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మురళికి భార్య, కుమారుడు ఉన్నారు. మురళి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపారు.

అభివృద్ధి చేస్తా.. వచ్చే ఎన్నికల ఖర్చు మీదే

● మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 5: మునుగోడు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా, అందుకు 2029లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అయ్యే ఖర్చులను ప్రజలే భరించి తనను గెలిపించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2023లో జరిగిన మునుగోడు ఉపఎన్నిక దేశంలోనే ఆసక్తిని కలిగించిందని అన్నారు. తనను ఓడించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కుట్రలు చేసిందని, అప్పటి ముఖ్యమంత్రి, మంత్రులుసహా ఆ పార్టీకి చెందిన 100మంది ఎమ్మెల్యేలు ఇక్కడే తిష్టవేసి డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేశారని ఆరోపించారు. ఓటర్లు పోలింగ్‌కు ముందు రోజు రాత్రి పూట కూడా తమ ఇళ్ల తలుపులు తెరిచే ఉంచి కరెంటు బల్బులను నిలుపకుండా డబ్బులు అందే వరకు నిద్రపోకుండా ఎదురుచూశారంట అని రాజగోపాల్‌రెడ్డి అనడంతో సభికుల్లో నవ్వులు విరబూశాయి. మునుగోడు పరిస్థితి తెలంగాణలో ఎక్కడా లేదని, ఎన్నికలు వస్తే ఇక్కడ పండగేనని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖర్చుల కోసం ప్రజలే డబ్బులు ఎదురిచ్చి తనను గెలిపించాలని కోరారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తనకు పదవులు ముఖ్యం కాదని, ప్రజల బాగోగులకే ప్రాధాన్యం ఇస్తానని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

ముగ్గురు రిమాండ్‌కు తరలింపు

వలిగొండ, ఆగస్టు 5: కిరాణ దుకాణం నడుపుతూ మోసపూరితంగా పలువురు నుంచి రూ.కోటి 50లక్షలు అప్పులుగా తీసుకొని ఉడాయించిన ముగ్గురు సోదరు లను సోమవారం అరెస్టు చేసి జ్యుడిషయల్ రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా మండలం లోని గొల్నేపల్లి గ్రామనికి చెందిన కొర్లపల్లి వెంకటేశ్వర్లు, ప్రశాంత్, అనిల్‌కుమార్ అన్నదమ్ములు, జీవనోపాధి కోసం కొన్ని సంవత్సరాల నుంచి అదే గ్రామంలో కిరాణ దుకాణం నడుపుతున్నారు. కిరాణ అవసరాల కోసం వడ్డీకి డబ్బులు కావాలని పలువురిని పదే పదే అడిగేవారు. వారిలో కొందరికి నెలవారిగా వడ్డీలు చెల్లించి రుణదాతలను నమ్మించారు. గుణగంటి హరిక నుంచి రూ.4.30లక్షలు చిరుగోని శ్వేత నుంచి రూ.2.30లక్షలు, మిర్యాల సాయికుమార్ నుంచి రూ.10.50లక్షలు, కుంభ వెంకట్‌రెడ్డి నుంచి రూ.13లక్షలు, మిర్యాల అంజయ్య నుంచి రూ.6లక్షలు, అవుశెట్టి రాములు నుంచి రూ.8లక్షలు అప్పు తీసుకున్నారు. (సుమారుగా కోటి 50లక్షలు) అప్పులుగా తీసుకొని జూలై 15 తేదీన ఇంటికి తాళం వేసి కుటంబసభ్యులందరూ ఉడాయించారు. దుకాణం తెరవకపోయేసరికి అప్పులు ఇచ్చిన వారికి ఆ వ్యాపారులపై అనుమానం కలిగి ఆరా తీయగా, వారు ఉడాయించినట్లు అర్థమైంది. జూలై 23న గంగాపురం దైవాదీనం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తప్పించుకొని తిరుగుతున్న ముగ్గురు అన్నదమ్ములను అరెస్టు చేసి జ్యూడిషయల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రచయిత్రి సుజాతాదేవి మృతి

నల్లగొండ టౌన్, ఆగస్టు 5: రచయిత్రి డొకల సుజాతాదేవి(77) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు సమీపంలోని చింతపల్లి గ్రామంలో 1947 ఏప్రిల్ 26వ తేదీన సీతామహాలక్ష్మి, నాగభూషణం దంపతులకు జన్మించారు. అడవిలో జంతువుల మధ్య సంభాషణలతో కథ నడిపిస్తూ అంతర్లీనంగా అనేక సామాజిక విలువలను బోధిస్తూ ఆమె రాసిన 'ఆటలో అరటిపండు' అనే చిన్న పిల్లల కథా సంకలనానికి 2013లో సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఎంఏ తెలుగు లిటరేచర్ చదివిన సుజాతాదేవి 'ఆహ్వానం' తెలుగు సాహిత్య పత్రిక, ఆంధ్రమహిళా సభ పబ్లికేషన్స్ విభాగం, సీపీ బ్రౌన్ అకాడమీల్లో అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. ఆమె భర్త డాక్టర్ నారాయణరావు ఆడిటర్. వీరికి ముగ్గురు ఆడపిల్లలు సంతానం. పెద్ద కూతురు పద్మజ చిత్రకారిణి, రెండో కూతురు అంజలి సైకాలజిస్ట్, మూడో కూతురు నల్లగొండ పట్టణానికి చెందిన ఏచూరి శైలజ వ్యాపార రంగంలో ఉన్నారు.



అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతి

బీబీనగర్, ఆగస్టు 5: యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని పడమటిసోమారం గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ రమేశ్ సోమవారం తెలిసిన వివరాల ప్రకారం... అశోక్‌నగర్ మల్లాపూర్‌కు చెందిన బొంత ముత్యాలు(60) పడమటి సోమవారం శివారులోని ఓ వెంచర్‌లో నాలుగు నెలలుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి వెంచర్ సమీపంలో బహిర్భుమికి వెళ్లి అక్కడే మృతిచెందాడు. సోమవారం తెల్లవారుజామున ముత్యాలు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ముత్యాలు భార్య నాగమ్మ తన భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.





ప్రతీ ఇంటికి శుద్ధిచేసిన జలాలు



చౌటుప్పల్‌లో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

చౌటుప్పల్ టౌన్/ సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 5: ప్రతీ ఇంటికి నల్లాల ద్వారా శుద్ధి చేసిన జలాలను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం చౌటుప్పల్ పట్టణంలో కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ పథకం క్రింద రూ. 21 కోట్లతో చేపట్టిన మంచినీటి పథకం, పట్టణంలోని జాతీయ రహదారి నుంచి లింగారెడ్డి గూడెం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును 9.95కోట్లతో నాలుగు వరసలుగా విస్తరించే పనులకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మునిసిపాలిటీలో ప్రత్యేకంగా ఏడు లక్షల లీటర్ల సామర్థ్యం గలవి రెండు, ఐదు లక్షల లీటర్ల సామర్థ్యం గలవి రెండు ఓవర్ హెడ్ ట్యాంక్ లతో పాటు 27 కి. మీటర్ల పొడవు గల పైప్‌లైన్‌లను నిర్మించనున్నట్టు ఆయన వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు , డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పి.శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తాడూరు వెంకట్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ బాల ప్రసాద్, డీఇ సురేంద్ర కుమార్, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు, డీఈ మనోహర, మునిసిపల్ కమీషనర్ ఎన్‌వీ నాయక్, డీఈ రాములు, వైస్ ఛైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్‌లు బొడిగే అరుణ, దండ హిమబందు, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ చెన్నగోని అంజయ్య, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం సురేందర్ రెడ్డి ,హర్షవర్ధన్ రెడ్డి ఏఈలు లింగయ్య, వెన్నెల కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, బాల్యం చలపతి ,ఆకుల ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు. అదే విదంగా స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో బాగంగా బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల, జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి , మునిసిపల్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు మొక్కలను నాటారు. లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

● స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మొక్కలు నాటారు. తరగతి గదులు బాగాలేవని తమకు ఇబ్బందిగా ఉందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు తరగతి గదులు నిర్మిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం అక్కడక్కడా బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్నారని, ఎక్కడపడితే అక్కడ మద్యం దొరకడం ద్వారా మద్యానికి బానిసలై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. బెల్టుషాపులను మూసివేయించాలని ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసిసిబి ఛైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ జక్కిడి జంగారెడ్డి, తాసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, డిఈ దీన్ దయాల్, మాజీ ఎంపీపీ లు గుత్తాఉమాదేవి, బుజ్జినాయక్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు. అనంతరం మండల కేంద్రంలోని గ్రామపంచాయితీ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలతో పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామాలలో నెలకొన్న సమస్యల గురించి ఎమ్మెల్యేకు పలువురు నేతలు వివరించారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను అంచెలంచెలుగా పరిష్కారిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మన ఊరిని మనమే బాగు చేసుకోవాలి: ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు/ అడ్డగూడూరు : ప్రతీ ఒక్కరు 'మన ఊరిని మనమే బాగు చేసుకోవాలి' అనే ఆలోచనతో ఉండాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని దాచారం గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇంటి ముందు అపరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు. దాచారం చెరువు నింపడానికి మూసీ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య, గ్రామ ప్రత్యేక అధికారి, వెటర్నరీ ఏడీ ఎన్.మోతీలాల్, సింగిల్ విండో ఛైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ఆకుల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శంకరయ్య, ఎంపీవో రాఫూఫ్అలి, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పెంచి, పచ్చదనాన్ని కాపాడాలని మునిసిపల్ ఛైర్ పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, కమిషనర్ సి.శ్రీకాంత్ అన్నారు.



దాచారంలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు పోలినేని ఆనందమ్మ, మునిసిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

● అడ్డగూడూరు మండలంలోని డి.రాపాక గ్రామపంచాయతి ఆవరణంలో గ్రామస్థులు, విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే సామేల్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీ నగదు రైతు ఖాతాలో జమ కావాడం లేదని కొందరు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సామేల్ వివిధ బ్యాంక్ శాఖల అధికారులతో మాట్లాడాడి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి, తహసీలార్ శేషగిరిరావు, ఎంపీడీవో శంకరయ్య, ఎంపీవో ప్రేమలత నాయకులు లింగాల నర్సిరెడ్డి, నిమ్మనగోటి జోజి, చేడే చంద్రయ్య, చిప్పలపల్లి పరుశురాములు, సురేందర్‌రెడ్డి ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



బొల్లేపల్లిలో ర్యాలీలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

భువనగిరి రూరల్: మన పరిసరాలను మనమే శుభ్రపరుచుకున్నట్లయితే మనకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు గ్రామమంతా పరిశుభ్రంగా ఉంటుందని జడ్పీ డిప్యూటీ సీఈవో డి.విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పిచ్చిమొక్కల తొలగింపుతో పాటు మురికి కాల్వల శుభ్రం, ప్రతిజ్ఞ , ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, ఎంపీవో ఎం దినకర్ గౌడ్, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మునిపల్ ఛైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, కమిషనర్ కె.వీరారెడ్డి, వైస్ ఛైర్మన్ బాత్క లింగస్వామియాదవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆర్‌పీలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నేతాజీ చౌరస్తాలోని దుకాణ యజమానులకు పట్టణ ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించి, మానవహారం నిర్వహించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్లు కుడికాల అఖిలబలరాం, దేవరాయ కుమార్, కో-ఆప్షన్ సభ్యులు జెల్ది నర్సింహ, వైద్యఆరోద్యశాఖ అధికారి డాక్టర్ శ్రీవాణి, మున్సిపల్ మేనేజర్ నిర్మల పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: మండలంలోని శారాజీపేట, కొలనుపాక, ఆలేరు తదితర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అయా కార్యక్రమాల్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, సీఐ దీపిక, రాధాకిషన్, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

గుండాల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి గూడ వెంకటేష్ మాట్లాడారు. సుద్దాల, బ్రాహ్మణపల్లి, సీతారాంపురం, వెల్మజాల, మర్రిపడగ గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ ధనుంజయ్, పంచాయతీ కార్యదర్శులు మధు, సోఫియా, వెటర్నరి డాక్టర్ యాకూబ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మోటకొండూరు : మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిర, ఎంపీవో చంద్రశేఖర్, ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్ అంగన్‌వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీడీవో రాములునాయక్, పంచాయతీ కార్యదర్శి టి.ఆనంద్‌కుమార్, నాయకులు వై.కవిత, జె.నగేష్ , బి.చందర్, వై.లక్ష్మారెడ్డి, వై. ఇంద్రారెడ్డి, పి.మల్లేశం, కె.శ్రీశైలం, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బీబీనగర్: మండలంలోని గూడూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో డీపీవో సునంద, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీధర్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, తాజామాజీ సర్పంచ్ గడ్డం బాల్‌రెడ్డి ఉన్నారు.



పోచంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మార్కండేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న సిల్క్‌యారన్ అసోసియేషన్ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 5: మార్కండేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి పాలకమండలి బృందం సహకారంతో కృషి చేస్తానని దేవాలయం అధ్యక్షుడు డాక్టర్ సీత సత్యనారాయణ అన్నారు. సోమవారం మార్కండేశ్వరస్వామి ఆలయ పాలకవర్గాన్ని పట్టణంలోని సిల్క్‌యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరపల్లి రవీందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు సీత సత్యనారాయణ మాట్లాడుతూ పద్మశాలి చేనేత సంఘాల నాయకుల సహకారంతో ఆలయ అభివృద్ధికి పాటుపడాతమని అన్నారు. కార్యక్రమంలో సిల్కు యారన్ బాధ్యులు సూరపల్లి రవీందర్, ఇంజమూరి యాదగిరి, నామాల కృష్ణమూర్తి, కూరపాటి స్వామి, గుండు పరమేష్, చక్రాల నర్సింహ, చిక్క విష్ణు, బడుగు మహేష్, సభ్యులు ఆంజనేయులు, కృష్ణ, సురేష్, శ్రీహరి, భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సింగిల్‌విండో వైస్ ఛైర్మన్ అంజయ్య

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 5: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని సింగిల్‌విండో వైస్ ఛైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎస్.లింగోటంలో హెచ్ఎండీఏ నిధులతో ఓంకారేశ్వరస్వామి దేవాలయం నుంచి ఆంజేయస్వామి దేవాలయం వరకు నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేవేళ్లి శివకృష్ణ, కుర్నాల వెంకటేశం, గంగాపురం గంగాదర్, సొప్పరి జనార్థన్, బాతరాజు లింగస్వామి, బొడిగే అనంద్, బాతరాజు నాగయ్య, చెవెళ్లి వెంకటేశం, కిరణ్, రాచకొండ నర్సింహ, ప్రవీణ్, రమేష్ పాల్గొన్నారు.

ఎస్సీలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి



ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

రామన్నపేట, ఆగస్టు 5: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఎస్సీలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోని రాగానే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లోన్స్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చి, విస్మరించిందన్నారు. అంబేడ్కర్ ఆవాస్ యోజన పథకం కింద అర్హులైన దళిత కుటుంబాలకు రూ.12లక్షలు అందజేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు రాపోలు రమేష్, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, నాయకులు మారూరి ప్రభాకర్, అల్లపు దుర్గయ్య, వనం అంజయ్య, దావనూరి వెంకటేశం, కట్ట యాదయ్య, రచ్చ ఆనంద్, రాపోలు గణేష్, భువనగిరి వెంకటేశం, నరేష్, ప్రభాకర్, ఆచారి బట్టే, శ్రీను, స్వామి ఉన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

వలిగొండ, ఆగస్టు 5: తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు ఆ ఫోరం సభ్యులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా క్రిస్టఫర్ మాట్లాడుతూ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేయలన్నారు. ఇప్పటికే అనేక మంది ఉద్యమకారులు చనిపోయారని, కొంత మంది ఆర్థికంగా నష్టపోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రజాపాలన దరఖాస్తులో నమోదు చేసుకున్న ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శీలం స్వామి, బత్తిని రవి, లావణ్య, అంజయ్య, వెంకటేశం, మల్లమ్మ, రమేష్, బాలయ్య, సత్తయ్య, నస్రిమ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 5: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండి ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. సోమవారం గుట్టలో తెలంగాణ పవర్ డిప్లమా అసోసియేషన్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆశించిన విధంగా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్నాటి వరున్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. మధుసూధన్‌రెడ్డి, పి. బీసీరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చలపతిరావు, మనోరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతలో పడి వ్యక్తికి గాయాలు

మోటకొండూరు, ఆగస్టు 5: మండలంలోని కాటేపల్లి గ్రామ పరిధిలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పి గుంతలో పడి ఓవ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాంచారిపేట గ్రామానికి చెందిన ముసుగు మల్లారెడ్డి తన ద్విచక్ర వాహనంపై వలిగొండ మండలంలోని గోలిగూడెం గ్రామంలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. రాయగిరి-మోత్కూరు ప్రధాన రహదారిపై ఉన్న కాటేపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి సమీపంలో రోడ్డు పూర్తిగా గుంతల మయం కాడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి గుంతలో పడింది. వాహనదారుడికి తల, మూతి భాగంలో గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చి అంబులెన్స్‌లో భువనగిరిలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తల్లిపాల ప్రాముఖ్యాన్ని చాటాలి



తల్లులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 5 : మండల పరిధిలోని దేశ్‌ముఖి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల ప్రాముఖ్యంపై ర్యాలీ నిర్వహించిన అనంతరం కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూపర్‌వైజర్ పద్మ, బస్తీ దవాఖానా డాక్టర్ సందీప్ హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై పిల్లల తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గుండ్ల రుక్మిణి, సహాయకురాలు జంగమ్మ, ఆరోగ్య కార్యకర్త సునీత తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్‌సార్ జీవితం స్ఫూర్తిదాయకం



జయశంకర్‌సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న లెక్చరర్లు

భువనగిరి టౌన్, ఆగస్టు 5: తెలంగాణ ఉద్యమ సిద్ధాతకర్త జయశంకర్‌సార్ జీవితం స్ఫూర్తిదాయకమని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఛైర్మన్ కత్తి వెంకటస్వామి అన్నారు. సోమవారం భువనగిరిలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో ఆయన మాట్లాడుతూ, జయశంకర్‌సార్ ఆశయాల సాధనకు తెలంగాణ పాలకులు నాయకులు, ప్రజలు కృషి చేయాలన్నారు. అనంతరం జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు కోడిమాల కృష్ణ, సింగనబోయిన మల్లేశం, దరిపెల్లి ప్రవీణ్‌కుమార్, శ్రవణ్‌రెడ్డి నమో రమేష్ పాల్గొన్నారు. కాగా తెలంగాణ లెక్చరర్స్ ఫోరం జిల్లా కన్వీనర్‌గా ఎండీ.యాకూబ్‌బాబా, రాష్ట్ర కార్యదర్శిగా కర్తాల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం ఛైర్మన్ కత్తి వెంకటస్వామి భువనగిరిలో నియామక పత్రాలు అందజేశారు.

శ్రావణ మాస పూజలు ప్రారంభం

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 5: చౌటుప్పల్ పట్టణంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో సోమవారం శ్రావణమాస పూజలు ప్రారంభమయ్యాయి. ప్రతీ రోజు ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం, భక్తుల గోత్రనామార్చన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. మొదటి రోజు కార్యక్రమాల్లో దర్మకర్తల మండలి సభ్యులు బి. మురళి, గుర్రం వెంకటేశం, టి. నర్సింహ్మా, కె .చంద్రశేఖర్, పి. శ్రీలతా శ్రీనివాస్ చారి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మంచికంటి భాస్కర్, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ ఊడుగు మల్లేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు తాడూరు పరమేష్, ప్రధాన అర్చకులు పెద్ది సుధాకర్ శర్మ, పెద్ది కిషోర్ శర్మ పాల్గొన్నారు.

మోత్కూరు : శ్రావణ మాసం తొలి సోమవారం కాకతీయుల కాలం నాటి మోత్కూరు శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్థానిక మునిసిపల్ కమిషనర్ చెన్నిశ్ల శ్రీకాంత్ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు.

కేరళ వరద బాధితులకు అండగా నిలవాలి



రామన్నపేటలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, ఆగస్టు 5: కేరళ వరద బాధితులకు అందరూ తోడ్పాటునందించి, ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జల్లల పెంటయ్య కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో వయనాడ్ వరద బాధితులకు సహాయర్థం విరాళాసేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేరళలో ప్రకృతి విపత్తు సంభవించి కొండచెరియలు విరిగిపడి, వందలాది మంది మృత్యువాతపడి, అనేక ఇళ్లు నేలమట్టయ్యాయన్నారు. ఆపదలో ఉన్న కేరళ ప్రజలను ఆదుకోవడం, మానవత్వంతో స్పందించడం అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు గాదె నరేందర్, మాజీ వైస్ఎంపీపీ నాగటి ఉపేందర్, నాయకులు ఆముద అంజనేయులు, అప్పం సురేందర్, పుట్టల ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

వలిగొండ: కేరళ వరద బాధితుల సహాయార్థం విరివిగా విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ప్రభుత్వ కేరళ విరాళాల సేకరణను చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుల ముత్యాలు, తుర్కపల్లి సురేందర్, చీర్క శ్రీశైలంరెడ్డి, కందడి సత్తిరెడ్డి, సురేష్, గర్దాసు నర్సింహ, యాదగిరి, రామస్వామి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రామన్నపేట: అమరుల స్ఫూర్తితో గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాగీరు కిష్టయ్య అన్నారు. మండలంలోని ఉత్తటూరులో జరిగిన సమావేంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 5లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి ఉన్నాయన్నారు. కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏ ప్రభుత్వం కృషి చేయలేదన్నారు. నాయకులు మునుకుంట్ల లెనిన్, గడ్డమీది సత్తయ్య, పబ్బు యాదయ్య, చెరుకు శ్రీనివాస్, మునుకుంట్ల స్వామి, కర్నాటి సోమయ్య, మధు, రమేష్, అండాలు, యాదమ్మ, ధనమ్మ, మారమ్మ, పుష్ప పాల్గొన్నారు.

భువనగిరి రూరల్ : భువనగిరి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 69మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, నాయకులు చిక్కుల వెంకటేష్, శివకుమార్, నుచ్చు నాగయ్య పాల్గొన్నారు.

గుండాల: మండలంలోని తుర్కలషాపురం గ్రామంలో సోమవారం లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఇమ్మడి దశరథ, కొర్న నగేశ్, నారాయణ, యాదగిరి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: ముస్లింల ఆస్తులకు నష్టం కలిగేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్‌బోర్డు బిల్లు పార్లమెంట్‌లో వీగేలా వ్యవహరించాలని లోకసభ కాంగ్రెస్ పక్షనేత రాహుల్‌గాంధికి జిల్లా మైనార్టీ నాయకులు సోమవారం లేఖ రాశారు. వక్ఫ్‌బోర్డు బిల్లు ఆమోదం పొందితే తెలంగాణలో 77 వేల ఎకరాల భూములపై మసీదులు, దర్గాలు, పీర్ల కొట్టాలు, ఖబ్రస్థాన్‌లు హక్కులను కోల్పోతాయన్నారు. లేఖ రాసిన వారిలో వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ డైరక్టర్ ఎండి షరీఫ్ తదితరులు ఉన్నారు.

భువనగిరి టౌన్: ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా భువనగిరి పట్టణానికి చెందిన బండారి శివశంకర్ మాదిగ నియమితులయ్యారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నియామక పత్రం అందజేసినట్టు జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ తెలిపారు. వర్గీకరణ అమలుకోసం పోరాటాలు చేస్తానని ఆయన తెలిపారు.

భువనగిరి టౌన్: విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటూ కలెక్టర్ హనుమంత్ కె.జెండగేకు విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో భువనగిరిలో వినతి పత్రం అందజేశారు. కుల వృత్తులకు తగ్గుతున్న ఆదరణ, మార్వాడి వ్యవస్థ విస్తృతం కావడంతో విశ్వకర్మ వృత్తిదారులు పనులను, ఉపాధిని కోల్పోతూ ఆర్థిక ఇబ్బందులకు గురతున్నారని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ ఉపేంద్రాచారి, ఎర్రోజు రవీంద్రా చారి, ప్రతాప్ చారి, సత్యనారాయణాచారి, చక్రపాణీచారి, నాగార్జునాచారి, మల్లేశ్‌చారి పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణ టూవీలర్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడిగా ఊడుగు నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఎండీ.ఆలం, నరేష్, ప్రధాన కార్యదర్శిగా పాక రాములు, సహాయ కార్యదర్శిగా రామకృష్ణ, కోశాధికారిగా మహేష్, ప్రచార కార్యదర్శిగా టి.సాయి, గౌరవ అధ్యక్షుడిగా సుర్కంటి జానారెడ్డి, అంజయ్య. గౌరవ సలహాదారుడిగా నార్థన్‌రెడ్డి ఎన్నికయ్యారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని పుల్లాయిగూడెంలో బత్తిని లింగయ్య అనే రైతుకు చెందిన పాడి గేదె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడింది. గేదె విలువ రూ.90వేలు ఉంటుందని, ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని రైతు లింగయ్య ప్రభుత్వాన్ని కోరారు.

మోత్కూరు : షాద్‌నగర్‌లో దళితులైన సునీతభీమయ్య దంపతులపై విచక్షణా రహితంగా దాడిచేసిన పోలీసులను ప్రభుత్వం వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని బీఆర్ఎస్ ఎస్సీసెల్ మోత్కూరు మునిసిపాలిటీ అధ్యక్షుడు చెడిపల్లి రఘుపతి డిమాండ్ చేశారు. ఈమేరకు మోత్కూరు అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అంటే ప్రజలను చితకబాదడమేనా అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కూరెల్ల రమేష్, సాగర్, శ్రీను, నరేష్ పాల్గొన్నారు.

రామన్నపేట: మండల కేంద్రంలోని చత్రపతి యువసేన నూతన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఆరే సంతోష్ ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వినయ్ ముదిరాజ్, కోశాధికారి గుండోజి భూపాల్, దాసరి కుమర్‌యాదవ్‌లను ఎన్నుకున్నారు.

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములుశ్రేష్ఠికి స్థానిక చేనేత నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో చేనేత నాయకులు జోగు శ్రీనివాస్, సీత కృష్ణ, మిర్యాల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మోత్కూరు: మండలంలోని దాచారం గ్రామానికి చెందిన టీచర్ కర్నే వీరేశం, జ్యోతి దంపతులు వీరేశం తండ్రి భద్రయ్య జ్ఞాపకార్థం సోమవారం రూ.70 వేల విలువ కల్గిన ఫ్రీజర్ బాక్స్ (కూలింగ్ శవపేటిక)ను ఆ గ్రామ ప్రత్యేక అధికారి ఎన్.మోతీలాల్‌కు అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ మంగపండ్ల ధనమ్మమల్లయ్య, మాజీ వార్డుసభ్యుడు అంతటి సంతు, సంఘబంధం అధ్యక్షురాలు కంబంపాటి రేణుక, అండెం అనిత పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని సంగెం గ్రామానికి చెందిన రత్నం శేఖర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబసభ్యులకు 2010-2011 ఎస్ఎస్‌సీ బ్యాచ్ బాల్యమిత్రులు రూ.29, 000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బాల్యమిత్రులు భరత్, బాలకిషన్, శివ, బుల్లెట్ సూరి పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీఐ ఎదుట ఒక రోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు చెక్క వెంకటేష్, గొట్టిపాముల శ్రీనివాస్, కనకయ్య, రాజయ్య, జానమ్మ ఉన్నారు.

భువనగిరి రూరల్: పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలందించి పదోన్నతిపై సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బదిలీపై వచ్చిన డాక్టర్ సునీల్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. గతంలో ఈయన భువనగిరి ఏరియా ఆసుపత్రిలో ఆర్ఎంవోగా విధులు నిర్వహించారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, రాజు ఉన్నారు.